# 'చక్‌దే హైదరాబాద్‌'

ఆగస్టు 25, 2007 శనివారం రాత్రి హైదరాబాద్ లుంబినీ పార్క్‌లోనూ గోకుల్ చాట్‌లోనూ టెర్రరిస్టులు బాంబులు పేల్చి 44 మంది అమాయకుల ప్రాణాలను బలిగొన్న దుర్ఘటనకు చలించిన ప్రవాసాంధ్రుడు, ఇంగ్లండులోని మాన్‌చెస్టర్ అకాడెమీ ఆఫ్ ఇంగ్లీష్‌లో ఆపరేషన్స్ మేనేజర్‌గా పనిచేస్తున్న శ్రీశైల్ రెడ్డి పంజుగుల 'చక్‌దే హైదరాబాద్' అనే వినూత్న కార్యక్రమాన్ని నవంబర్-డిసెంబర్ 2007లో హైదరాబాద్ సహా నాలుగు జిల్లాల్లో నిర్వహించారు. ఆ కార్యక్రమం వివరాలు ఆయన మాటల్లోనే...

'ఆ సంఘటన జరిగినపుడు నేను మాంచెస్టర్‌లోనే వున్నాను. యేదో పనిలో వుండగా మిత్రుడు రషీద్ ఫోన్‌చేసి బాంబుపేలుళ్ల గురించి చెప్పాడు. వెంటనే నేను హైదరాబాద్‌లో వున్న మా ఆవిడతోనూ, పిల్లలతోనూ మాట్లాడాను. ఆరోజే మిత్రులు సౌదా అరుణల దర్శకత్వంలో రవీంద్రభారతిలో 'బర్బరీకుడు' నాటక ప్రదర్శన జరుగుతోంది. సౌదా, సజయ, సమతా లాంటి స్నేహితులందరినీ పలకరించాను. 'మనవాళ్లంతా వోకేనే కదా' అని అడిగాను. అప్పుడు నన్నో ఫీలింగ్ తొలిచేయడం మొదలుపెట్టింది. మనవాళ్లు వోకేనే కానీ మరి చనిపోయిన వాళ్లు? వాళ్లతాలూకు బంధువులు? ఆ సంఘటన చూసినవాళ్లు? క్షతగాత్రులయినవాళ్లు? అక్కడి ప్రజలు? మరి వాళ్ల సంగతేమిటి? వాళ్ల గురించి నాకు తెలిసేదెలా? అప్పుడూ ఆ తర్వాతా ఆ సంఘటనల గురించి వాళ్లు యేమనుకుంటున్నారు? జాతీ నీతీ మతం మానవత్వం లేని ముష్కరులు చేసిన యీ మారణహోమం యెక్కడికి దారితీస్తుంది? యింకా యెంతమంది సమిధలవుతారు? జరిగిన దారుణంలోని అమానవీయతను మతం రంగులోంచి చూస్తే... దానికి స్వార్థపర శక్తులు ఆజ్యంపోస్తే... వొళ్లు జలదరించింది. వేచి చూశాను. ఆ తెల్లారీ మరో రెండు రోజులూ... నిశితంగా గమనిస్తూ వున్నాను... యెవరిపని వారు చేస్తూ వున్నారు. రాజకీయ నాయకులు స్టేట్‌మెంట్సు యిచ్చారు, పోలీసులు తమపని చేసుకుంటున్నారు, మీడియా అందర్నీ చీల్చి చెండాడుతోంది... యివేవీ నా దృష్టిని మరల్చలేదు ప్రజలపైనుంచి. యెంతో సంయమనం చూపించిన హైదరాబాద్ వాసుల పైనుంచి...

న్యూయార్క్‌లోనూ లండన్‌లోనూ ఉగ్రవాద దాడుల అనంతరం ప్రజలెంత మెచ్యూరిటీ చూపించారో ఆవేశకావేశాలకు లోను కాకుండా యెలావున్నారో ముంబాయిలోనూ హైదరాబాద్‌లోనూ నా దేశవాసులు అచ్చం అలాగే అంత పరిణతితోనే, అంత స్నేహశీలతతోనే, అంత జీవన కాంక్షతోనే వుండడం నన్ను ఆనంద పరవశుడిని చేసింది. యీ అపురూపమైన స్ఫూర్తి యెల్లకాలం వుండిపోవాలనిపించింది. యీ మానవీయ దృశ్యం అన్‌నోటీస్డ్‌గా వుండిపోకూడదనిపించింది. నలుగురికీ చెప్పాలనిపించింది. ముగ్గురితో మాట్లాడాను...

మిత్రులు సౌదా, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు ఎకె ప్రభాకర్, కవిమిత్రుడు సిఎస్ఎ షరీఫ్‌లకి చెప్పాను. 'మనం యేదైనా ప్రోగ్రాం తీసుకుందాం' అన్నారు వాళ్లు. హైదరాబాదీల సంయమనాన్ని కొనియాడుతూ అది అలాగే కొనసాగాలని కాంక్షిస్తూ 'చక్‌దే హైదరాబాద్' పేరిట 8, 9, 10 తరగతుల స్కూలు పిల్లల్ని కల్సి, మాట్లాడి, వాళ్లకి విషయం చెప్పి, వాళ్ల అభిప్రాయాల్ని తెల్సుకుని అదంతా రికార్డ్ చెయ్యాలన్న ఆలోచన వచ్చింది. 'వాళ్లని మరింత భాగస్వాములు చేయడం కోసం వాళ్లతో బాంబు పేలుళ్ల పై వ్యాసాలు రాయమందాం' అన్నారు షరీఫ్.

'సౌదా రాసిన నల్లగుర్రపు నాడా పుస్తకం చదివి వినిపిస్తున్నప్పుడు పిల్లల ముఖాల్లో ఆందోళనని కనిపెట్టాను. యుద్ధాల్నీ దారుణాల్నీ రక్తపాతాల్నీ అమానవీయతల్నీ పిల్లలు నిరసించడం నేను చూశాను. వాళ్లకంటే మనకి సరైన, అవసరమైన ఆడియెన్స్ యింకెవరు?' అన్నారు ఎకె ప్రభాకర్.

నాలుగు జిల్లాలు తిరగాలని నిర్ణయించుకున్నాం. 400 స్కూళ్లకి మా ఆలోచనలు చెప్తూ వాళ్ల పార్టిసిపేషన్ కాంక్షిస్తూ కరపత్రాలు పంపాం. 31 స్కూళ్లు మాకు ఆమోదం తెలిపాయి. యిందులో ప్రభుత్వ, ప్రైవేటు, మైనారిటీ, కార్పొరేట్, ఇంటర్నేషనల్ - యిలా అన్ని రకాల స్కూళ్లు వున్నాయి. వాళ్లకి వ్యాసరచన కోసం అప్లికేషన్ ఫార్మ్స్ పంపాం. ఆయా స్కూళ్లల్లో సమావేశ తేదీల్లోగానే మాకు వ్యాసాలు అందేలా యేర్పాటు చేసుకున్నాం. ప్రభాకర్, ఆయన శ్రీమతి రాజ్యలక్ష్మి (యీమె కూడా ఉపాధ్యాయినే) ఆ వ్యాసాల్ని సమీక్షించేలా నిర్ణయించాం.

నిర్ణీత తేదీల్లో ఆయా స్కూళ్లల్లో సమావేశాలు నిర్వహించాం. వాళ్లురాసిన వ్యాసాల్లోని అంశాల్ని స్పృశిస్తూ వాళ్లతో మా ఆలోచనల్నీ, ఆందోళనల్నీ, అభిప్రాయాల్నీ, ఆనందాన్నీ పంచుకున్నాం. అలా నాలుగువేల మంది స్కూలు పిల్లల్ని కలిశాం. వాళ్లందరికీ సౌదా రాసిన నల్లగుర్రపు నాడా పుస్తక ప్రతుల్ని పంచాం. ఆయా స్కూళ్ల ప్రిన్సిపాల్స్, టీచర్స్, కొండొకచో మండల రెవెన్యూ అధికారీ, స్థానిక ప్రముఖులు,

ప్రజాప్రతినిధులు,  యువసత్తా, లీడ్ యిండియా 2020 లాంటి సంస్థలూ - యిలా అందరూ పాలుపంచుకున్నారు యీ 20 రోజుల శాంతి జాగృతి వుత్సవాల్లో.

* * *

# విద్యార్థుల మనోభావాలు

(మూడవ తరగతి నుంచి మెడిసిన్ మూడో సంవత్సరం చదువుతున్న వారి వరకు)

'యెక్కడ రక్తం చిందినా, ఆందోళన జరిగినా, ముందు బాధపడేది అమ్మ. యుద్ధరంగంలో యెవరు తూటా పేల్చినా ముందు తగిలేది అమ్మకే' - వికాస్, 10వ తరగతి, షాలిబండ ప్రభుత్వ పాఠశాల

'Bomb blast is the cruellest act against humanity and the people who plant this do not belong to any religion but can be termed as the traitors of humanity. I could not help crying on seeing the plight of people' - Juveria Javid, 8th Class, St. Ann's Girls High School, Vijayanagar Colony

'హుసేన్‌సాగర్ బుద్ధుని సాక్షిగా లుంబినీ వనంలో క్షతగాత్రుల ఆర్తనాదం
పాతబస్తీ చార్మినార్ సాక్షిగా గోకుల్‌చాట్‌లో చావు బతుకుల మేళా
శాంతికపోతం స్వేచ్ఛగా రెక్కలార్చి యెగిరేదెన్నడో
శాంతివనంలో స్నేహసుమాలు సుగంధ పరిమళాలు వెదజల్లేదెన్నడో
వుగ్రవాదుల ఆగడాలకు చరమగీతం పాడేదెన్నడో'
- బి. శ్వేత, 10వ తరగతి, త్రివేణి టాలెంట్ స్కూల్, ఆల్వాల్, సికింద్రాబాద్

'The bomb blasts did not serve the terrorists' purpose of dividing people. The dazed passers-by rushed into the building minutes after the blast and dragged the injured out. With no ambulance readily available, they stopped a city bus and loaded all the injured into it and rushed them to hospitals. This is amazing.' - K. Koundinya, 9th Class, Bharatiya Vidya Bhavan, BHEL

'పేలుళ్ల తర్వాతి విపత్కర పరిస్థితుల్లో గాయపడిన వారిని ఆదుకుంటున్న మానవతామూర్తులను చూశాను. సమాజంలో వున్న ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడానికి వుగ్రవాదులు చేసిన ప్రయత్నం బాధ కలిగించినా ప్రజలు దానిని తిప్పికొట్టడం సంతృప్తి కలిగించింది'. - వి. భార్గవి, 10వ తరగతి, సెయింట్ ఆన్స్ బాలికల పాఠశాల, విజయనగర్ కాలని

'At a moment I thought of killing all the terrorists but later I prayed God to give mercy and love in the hearts of those who have ruined many families'. - Zahid, 5th Class, The Hyderabad Public School, Begumpet

'యే దేశం పర్‌ఫెక్ట్‌గా వుంది? యెందుకు గర్వకారణం కారాదు మనం మనకు? యెంత బాగా వున్నాం మనం, అందుకు ఆనందిద్దాం. అలాగే వుందాం' - గణేష్, 7వ తరగతి, షాలిబండ ప్రభుత్వ పాఠశాల

'We must re-write the history to erode the thinking that the two religions are mutually enemies'. - Srimayi, 9th Class, St. Ann's Girls High School, Vijayanagar Colony

'భవిష్యత్తు మాదే. మా శక్తి ముందు వుగ్రవాదం వంటివి గడ్డిపోచలే. యువభారతం దేనికీ తలవంచదనీ, కావాలంటే తలలు యిస్తుందనీ ప్రపంచానికి, వుగ్రవాదులకు చాటి చెప్తాం'. - ఆర్. అనన్య, 10వ తరగతి, సెయింట్ ఆన్స్ బాలికల పాఠశాల, విజయనగర్ కాలని

'Terrorist uncles, why are you killing innocent people? Please don't do like this. I don't want to miss my school and my friends. Let us play and have fun. Why do you blast bombs on human beings? Blast them on flies and mosquitos and save people from diseases'. - Arnav Kumar Sahu, 3rd Class, Hyderabad Public School, Begumpet

‘యిటువంటి దారుణాలు వుద్దేశపూర్వకంగా చేసేవి కాబట్టి మనం ఆవేశ పడడం కంటే సంయమనం పాటించి మత సామరస్యాన్ని ప్రోత్సహించాలి అనే భావన కలిగింది‘. - పి.యల్.వి. పవన్‌కుమార్, 10వ తరగతి, శ్రీ సాయి సిద్ధార్థ స్కూల్, మోతీనగర్, యెర్రగడ్డ

‘జరిగిన యీ దుర్ఘటనలో హిందువులతో పాటు ప్రాణాలు కోల్పోయిన ముస్లింలకు నివాళులర్పిస్తూ గణేష్ చతుర్థినాడు యేర్పరచిన మండపాలలో సంతాపం ప్రకటించడం మనలోని మానవత్వాన్ని చాటిచెప్తోంది.‘ - కె. నీలిమ, 8వ తరగతి, గీతాంజలి స్కూల్, బేగంపేట

‘అసలు టెర్రరిస్టులకు బాంబులు తయారుచేసేందుకు మెటీరియల్ యెందుకు అమ్మాలి? అమోనియం నైట్రేట్ లాంటివి యెక్కువ మొత్తాలు యెవరైనా కొంటే వాళ్లను పోలీసులకి అప్పగించాలి. అలాగే పేలని బాంబులు కనిపెట్టడం కోసం సాటిలైట్ టెక్నాలజీ యేమైనా పనికొస్తుందేమో ఆలోచించాలి‘. - పి. నవ్య, 5వ తరగతి, సెయింట్ జోసెఫ్ హైస్కూల్, ఆస్మాన్‌ఘడ్, మలక్‌పేట

‘జిహాద్ అంటే మనుషులను చంపడంగా భావించే యీ ముష్కరులకు నిజంగా ఖురాన్ గురించి అవగాహన లేదు. అల్లా జీహాద్ చేయమన్నది పేదరికం, నిరక్షరాస్యత, అన్యాయం, అవినీతిపై‘. - కె. విష్ణుప్రియ, 9వ తరగతి, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, బేగంపేట

‘మతతత్వానికి ముఖ్యకారణం - మతంలో రాజకీయాలు మిళితమై వుండటం. యిది దేశంలో అనేక రాజకీయ మతకలహాలకు దారితీసింది. యెందరో అమాయకులు మరణించారు.‘ - ఐ. సాయివరుణ్, 7వ తరగతి, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, బేగంపేట

‘బాంబు పేలుళ్లలో మా బంధువులుగానీ తోడబుట్టినవాళ్లు గానీ యెవరూ లేరు. కానీ చనిపోయిన వాళ్లందరూ మా బంధువుల్లా అనిపించారు.‘ - ఎ. అనిత, 10వ తరగతి, జిల్లాపరిషత్ వున్నత పాఠశాల, హైదర్‌షా కోట, రంగారెడ్డి జిల్లా

‘అల్ప సంఖ్యాకులకు, అధిక సంఖ్యాకులకు మధ్య పరస్పర విశ్వాసం, సామరస్యం లోపించడం వల్ల భయానక వాతావరణం యేర్పడింది. వివిధ రాజకీయ పార్టీలు తమ స్వార్థ ప్రయోజనాలకోసం మతాన్ని ఆయుధంగా వాడుకొంటున్నాయి. మతం పేరుతో ప్రజలను వంచిస్తున్నాయి. యీ పరిస్థితుల్ని రూపుమాపవల్సిన అవసరం యెంతైనా వుంది.‘ - కె. దేదీప్యసాయి, 10వ తరగతి, రమాదేవి పబ్లిక్ స్కూల్, రామోజీ ఫిల్మ్ సిటీ

‘కనుమరుగవుతున్నది మనిషిలోని మానవత్వం
విచక్షణ మరచి విజృంభిస్తున్నది రాక్షసత్వం
తోటివారి ప్రాణాలు తీయడం యెంత క్రూరత్వం
చూసి విస్తుపోదా తనగుడ్లను తానే తినే పాముసైతం
వొకరికోసం వొకరుగా బ్రతకటంలోనే వుంది దైవత్వం
వొక హిందూ, వొక ముస్లిం, వొక క్రీస్తు కలిస్తేనే భారతం‘
- వి. కృష్ణవళి, 10వ తరగతి, శ్రీ సాయిసిద్ధార్థ స్కూల్, మోతీనగర్, యెర్రగడ్డ

* * *

‘యింత అద్భుతమైన కార్యాచరణ గురించి ముందు తెలిస్తే నేనూ వో స్కూల్‌కి వచ్చివుందును‘ అన్నారు తెలుగు విశ్వవిద్యాలయ వుపసంచాలకులు డాక్టర్ ఆవుల మంజులత. ‘నేను తప్పకుండా రావాల్సిందే‘ అన్నారు రాష్ట్ర అధికార భాషాసంఘం అధ్యక్షులు డాక్టర్ ఎబికె ప్రసాద్. ‘కేవలం యిందులో భాగస్వామినవడంకోసం నెల్లూరు నుంచి వస్తున్నాను‘ అన్నారు రచయిత్రి చంద్రలత.

డిసెంబర్ 1న హైదరాబాద్‌లో సమీక్షా సదస్సు నిర్వహించాం. డాక్టర్ మంజులత, డాక్టర్ ఎబికె ప్రసాద్, చంద్రలత వక్తలుగా వున్న యీ సభకు యీ శాంతి సందేశ కార్యక్రమంలో భాగస్వాములయిన పాఠశాలల నుంచి ఉపాధ్యాయులూ, విద్యార్థులూ విచ్చేశారు. విద్యార్థుల్లో ప్రస్ఫుటంగా కనిపించిన శాంతిసామరస్య కాంక్షను గుర్తించాం మేము. పిల్లలు యేం చెప్తున్నారో వినండని తల్లిదండ్రులకు, గురువులకు, అధికార్లకు, రాజకీయ నాయకులకు, మేధావులకు, కవులూ కళాకారులకూ విజ్ఞప్తి చేశాం. వాళ్లకు కావాల్సింది యివ్వాల్సిన బాధ్యత పెద్దలకు గుర్తుచేశాం. యెన్విరాన్‌మెంటల్ యెడ్యుకేషన్ వుండాలని అంటున్నారు, సెక్స్ యెడ్యుకేషన్ గురించి చర్చలు జరుగుతున్నాయి. అన్నిటికంటే ముఖ్యంగా ‘పీస్ ఎడ్యుకేషన్‘ స్కూల్ సిలబస్‌లో భాగం చెయ్యాలని తీర్మానం చేశాం...

విద్యార్థులు రాసిన దాదాపు నాలుగు వందల వ్యాసాలను సమీక్షించడం, ఎడిట్ చేయడం ప్రస్తుతం ప్రభాకర్, రాజ్యలక్ష్మిలు చేస్తున్నారు. యీ విద్యార్థుల మనోభావాల్ని పొందుపరుస్తూ వొక సంకలనం తీసుకురావాలని మా ప్రయత్నం. ప్రస్తుతం ఆ పనిలో వున్నాం.

* * *

మేము పిల్లల్ని వాళ్ల అభిప్రాయాలు చెప్పమని కోరడానికి కారణం...

తమ చుట్టూ జరుగుతున్న సంఘటనల పట్ల వాళ్లెలా స్పందిస్తున్నారు? యేమనుకుంటున్నారు? రేపటి పౌరులకు సమాజంతో యెలాంటి కనెక్షన్ వుంది? తల్లిదండ్రులు, గురువులు, కుటుంబం, సమాజం వీళ్లను బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దడానికి యేం చేస్తున్నారు? యెలా తోడ్పడుతున్నారు? యిత్యాది విషయాలను మేము తెల్సుకుని అందరికీ తెలియజెప్పాలని అనుకున్నాం. సమాజపు బాగోగుల్ని పెద్దలకు, రాజకీయ నాయకులకు, పోలీసులకు, మేధావులకు, విప్లవకారులకు, మీడియాకు మాత్రమే వదలివేయడం కాదు - రేపటితరం వాళ్లకు అందులో భాగస్వామ్యం కల్పించడం, అలాంటి ఆలోచనలు వారిలో పాదుకొల్పడం మా ముఖ్యోద్దేశం.

అయితే విద్యార్థులు తమ చుట్టూ వున్న పరిస్థితుల్ని పట్టించుకుంటున్నారని, సమాజపు బాగోగుల్ని గురించి ఆలోచిస్తున్నారని, వేదన పడుతున్నారని, దేశం పట్ల, దేశ వారసత్వం పట్ల గర్విస్తున్నారని మాకు తెలియవచ్చింది. యెంత స్వచ్ఛంగా, యెంత నిర్భయంగా, యెంత ప్రేమగా, యెంత అమాయకంగా వ్యక్తంచేసారో వాళ్ల భావాల్ని. యేదో చెప్పాలని బయల్దేరాం కానీ చివరికి యెంతో నేర్చుకున్నాం యీ యిరవైరోజుల్లో మా టీం సభ్యులం.

అందుకే, పెద్దలారా, మీ అందరికీ మా మనవి. పిల్లలతో గడపండి, వాళ్ల అభిప్రాయాలు వినండి. వాళ్లు మననుంచి యేం కోరుకుంటున్నారో తెలుసుకోండి. వాళ్లను మార్చడమే కాదు, మనం మారాల్సిన అవసరముందేమో ఆలోచించండి.

యిది మా విజ్ఞప్తి మాత్రమే కాదు, పిల్లల హృదయ స్పందన కూడా.

* * *

మతసామరస్యం కోసం 'చక్‌దే హైదరాబాద్' లాగానే, భారత సమాజంలో మన చుట్టూ జరుగుతున్న సంఘటనల్లోని మంచి అంశాల్ని ప్రచారం చెయ్యడం నిరంతరం కొనసాగించాలని మా ఆకాంక్ష. 'పాజిటివ్ మైండ్‌సెట్' కలిగివుండే అవసరాన్ని నేటితరం గుర్తించడం లక్ష్యంగా మా కార్యాచరణ వుంటుంది.

మా యీ ప్రయత్నాలకు మీ సహాయ సహకారాలు, సూచనలు యెంతైనా అవసరం. మా భావి కార్యక్రమాల గురించి తెలుసుకోవాలనుకుంటే, మా మెయిలింగ్ లిస్ట్‌లో వుండాలనుకుంటే srisail@gmail.com కి మెయిల్ చెయ్యండి. 'చక్‌దే హైదరాబాద్' వీడియోలు, ఫోటోల కోసం www.srisail.net/chakdehyd.htm చూడండి.

కృతజ్ఞతలతో,

Srisail Reddy Panjugula
Manchester, UK
www.srisail.net